క్లుప్తంగా

రేణుకా ఎల్లమ్మ ఉత్సవాలు



జోగు కార్యక్రమంలో భక్తులు

ఖానాపూర్: మండలంలోని పాతఎల్లాపూర్‌లో శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా అమ్మవారి ప్రతిమకు ప్రత్యేక పూజలు చేసి ఇంటింటా జోగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నాగుల అంజాగౌడ్, చంద్రగిరి శేఖర్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, చందు, వంశీ, సతీశ్, మహేశ్, శశి తదితరులు ఉన్నారు.

నేడు హజ్ యాత్రికులకు టీకా

నిర్మల్‌టౌన్: పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారి సౌకర్యార్థం ప్రభుత్వం ఉచిత టీకా వేయనున్నట్లు హజ్ సొసైటీ సభ్యులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రధాన ఆసుపత్రిలోని మొదటి అంతస్తులో శుక్రవారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు టీకా పంపిణీ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. హజ్ యాత్రికులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ మహిళ సాంకేతిక శిక్షణ సంస్థ, హైదరాబాద్ వారు అనాథలు, పాక్షిక అనాథలు(తండ్రి లేదా తల్లి చనిపోయిన వారు) నిర్లక్ష్యం చేయబడిన పిల్ల లు, మాతా శిశు సంక్షేమ శాఖ నడుపుతున్న పిల్లల గృహాల్లో ఉండే పిల్లలు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న, అక్రమ రవాణా బాధితులు పాలిటెక్నిక్ కోర్స్ చదవడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా, శిశు, దివ్యాంగులు, వయో వృద్ధుల సంక్షేమ శాఖ అధికారి నాగమణి తెలిపారు. పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష రాయకున్నా.. 10వ తరగతి ఉత్తీర్ణత గల అమ్మాయిలు 2024–25 విద్యాసంవత్సరంలో చేరేందుకు అర్హులని పేర్కొన్నారు. ఈ దరఖాస్తులను ఈనెల 20లోపు కమిషనర్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఇంటినంబర్ 8–3–222, మధురానగర్, సారథి స్టూడియో దగ్గర, యూసుఫ్‌గూడ, అమీర్‌పేట్, హైదరాబాద్ వారికి గాని, బాలరక్షా భవన్ ఆఫీస్, గొల్లపేట నందు గాని సమర్పించాలని వివరించారు. వివరాలకు 99637 38012 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. అనాథలకు కులం, ఆదాయ పత్రాలు అవసరం లేదని పేర్కొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి



రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌పీవో రమేశ్

కడెం: రోజురోజుకు ఎండలు పెరుగుతున్నందున నర్సరీలోని మొక్కలు ఎండిపోకుండా రోజు నీటిని అందించాలని డీఎల్‌పీవో రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని కొండుకూర్, కొత్తమద్దిపడగ గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ రికార్డులు, పల్లె ప్రకృతి వనాలను, సెగ్రిగేషన్ షెడ్లను, శ్మశానవాటికలను పరిశీలించారు. అనంతరం సిబ్బందికి సూచనలు చేశారు. ఎంపీడీవో అరుణ, ఎంపీవో కవిరాజు, కార్యదర్శులు అరుణ, ఫీరోజ్ తదితరులున్నారు.

సాయిబాబా ఆలయంలో భక్తుల సందడి

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. హారతిలో భక్తులు పాల్గొని బాబాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

చెరువు కట్టను తవ్వేశారు..!



రైతు తవ్వేసిన చెరువుకట్ట

కుంటాల: మండలంలోని లింబా(బి)లో కొత్త చెరువు కట్టను తవ్వేసినా.. అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. లింబా(బి)కే చెందిన ఓ రైతుకు కొత్త చెరువు కింద పొలం ఉంది. మూడు రోజుల కిందట చెరువు మట్టిని భూసారం పెంచేందుకు తన పొలంలోకి తరలించేందుకు సిద్ధమయ్యాడు. కానీ చెరువు మట్టిని దారి గుండా తన పొలంలోకి తరలిస్తే దూరభారం అవుతుందని భావించాడు. పొక్లెయినర్‌తో తన పొలం సమీపంలో ఉన్న చెరువు కట్టను తవ్వించి మట్టిని పొలంలో పోసుకున్నాడు. వెంటనే ఈ విషయాన్ని గ్రామస్తులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్‌ఖాన్‌ను 'సాక్షి' వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

భయపెడుతున్న ప్లాస్టిక్ భూతం

- పట్టణాలు, గ్రామాల్లో జోరుగా విక్రయాలు, వినియోగం
- కానరాని తనిఖీలు
- నియంత్రణలో విఫలమవుతున్న అధికారులు



సింగన్‌గాం రోడ్డు సమీపంలో ప్లాస్టిక్ కవర్లు



తానూరులో రహదారి సమీపాన కుప్పగా వేసిన ప్లాస్టిక్ కవర్లు

తానూరు: పర్యావరణానికి హాని కల్గించే ప్లాస్టిక్ వినియోగం విచ్చలవిడిగా పెరుగుతోంది. పట్టణాలు, గ్రామాలనే తేడా లేకుండా ప్లాస్టిక్ కవర్ల వ్యర్థాలు సమస్యగా మారాయి. మురుగుకాల్వలు ప్లాస్టిక్ కవర్లతో నిండుతుండటంతో పారిశుధ్య కార్మికులు వాటిని తొలగించేందుకు అవస్థలు పడుతున్నారు. గతంలో ప్లాస్టిక్ కవర్లను విక్రయిస్తున్న ఒకటి.. రెండు దుకాణాలపై అధికారులు దాడులు చేసి జరిమానాలు విధించారు. పలువురు దుకాణ యజమానులపై కేసులు కూడా నమోదు చేశారు. ఇప్పుడు తనిఖీలు చేయకపోవడంతో మళ్లీ ప్లాస్టిక్ విక్రయాలు జోరందుకున్నాయి.

విచ్చలవిడిగా విక్రయాలు..

ఇదివరకు దుకాణాలకు, కూరగాయల మార్కెట్‌కు సంచి తీసుకెళ్లే జనం ఇప్పుడు ఖాళీ చేతులతో వెళ్లి ప్లాస్టిక్ కవర్లలో వస్తువులను ఇళ్లకు తెచ్చుకుంటున్నారు. తర్వాత ఆ కవర్లను బయట పారేస్తుండటంతో మురుగుకాల్వల్లో చేరుతున్నాయి. ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం ఉన్నా.. వారసంత, మార్కెట్‌లో, దుకాణాల్లో చిరువ్యాపారులు తమ వ్యాపారం సాగేందుకు వీటిని వినియోగదారులకు వస్తువుల ద్వారా అందిస్తున్నారు.

ప్రచారం చేసినా.. ఫలితం శూన్యం

గతంలో అధికారులు వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి ప్లాస్టిక్‌తో కలిగే నష్టాలను వివరించి.. వాడకం, విక్రయాలను తగ్గించాలని అవగాహన కల్పించారు. కానీ వారు పట్టించుకోకపోవడంతో విక్రయాలు, వినియోగం తగ్గడం లేదు. పల్లె, పట్టణ ప్రగతి కార్యక్రమాల్లోనూ మున్సిపల్ అధికారులు, మండల అధికారులు ప్లాస్టిక్ కవర్ల నియంత్రణకు దాడులు చేసి తర్వాత మిన్నకుండిపోయారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని కరపత్రాలు, ఫ్లెక్సీలు, టీవీల ద్వారా ప్రచారం చేసినా ఫలితం ఉండటం లేదు.

మహారాష్ట్రలో నిషేధం ...

పక్క రాష్ట్రమైన మహారాష్ట్రలో అధికారులు నిబంధనలు కఠినంగా అమలు చేస్తూ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధిస్తున్నారు. అక్కడ మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించి ప్లాస్టిక్ కవర్లు అమ్ముతున్న దుకాణదారులకు దాడులు చేయడంతో అక్కడ పరిస్థితి అమల్లోకి వచ్చింది. సంతలో చిరువ్యాపారులు ప్లాసిక్ కవర్లు వినియోగిస్తే వారికి రూ.వెయ్యి వరకు జరిమానాలు విధిస్తున్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని స్థానిక అధికారులు కూడా చర్యలు చేపడితే మన వద్ద కూడా ప్లాస్టిక్ వినియోగం తగ్గుతుందని ప్రజలు పేర్కొంటున్నారు.

అందరూ సహకరిస్తే..

గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగం నివారణకు ప్రజల సహకారం ఎంతో అవసరం. అధిక మొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలు సేకరించి..రీసైక్లింగ్‌కు పంపే పంచాయతీలకు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వాలి. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వ్యాపారులు, దుకాణదారులకు నోటీసులు ఇవ్వడంతోపాటు జరిమానాలు విధించాలి.

ప్లాస్టిక్ నిషేధించాలి



విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగిస్తుండటంతో పర్యావరణానికి హాని కల్గుతుంది. గ్రామాల్లో అ ధికారులు అవగాహన కల్పించి ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. దుకాణదారులు, చిరువ్యాపారులతో మాట్లాడి ప్లాస్టిక్ విక్రయాలను నిషేధించాలి.

– గంగాధర్, బోరిగాం

తనిఖీలు నిర్వహిస్తాం

గతంలో వ్యాపారులు, దుకాణదారులకు ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని అవగాహన కల్పించాం. మళ్లీ దుకాణాలు, సంతలలో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకుంటాం. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల ద్వారా ప్లాస్టిక్ వినియోగంతో కలిగే నష్టాలను ప్రజలకు వివరిస్తాం.

– మోజాం హుస్సేన్, ఇన్‌చార్జి డీఎల్‌పీవో, భైంసా

బీజేపీ అభ్యర్థి నగేశ్‌ను గెలిపించాలి

- మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్
- గ్రామాల్లో ప్రచారం చేసిన నాయకులు



పెంబి: మందపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రమేశ్

పెంబి: ఆదిలాబాద్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి నగేశ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ అన్నారు. గురువారం మండలంలోని నాగాపూర్, మందపల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులతో ఎన్నికల ప్రచారం చేశారు. కమలం గుర్తుకు ఓటేసి మరోసారి మోదీని ప్రధానమంత్రిని చేయాలని కోరారు. మందపల్లిలో ఉపాధి కూలీల వద్దకు వెళ్లి కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ఈసందర్భంగా మందపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు కంచరి నరేందర్ బీజేపీలో చేరగా ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నాగాపూర్‌లో ఓ కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం చేశారు. బీజేపీ మండలాధ్యక్షుడు వెంకటేశ్, రామేశ్వర్‌రెడ్డి, నాగారాజు, రవి, రాజబాబు, రాజేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కడెం: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని బీజేపీ సీనియర్ నాయకుడు అమరవేణి రవీందర్‌గౌడ్ అన్నారు.గురువారం మండల కేంద్రంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇస్లావత్ మోహన్ నాయక్, ముల్కి కృష్ణ, రంజిత్ తదితరులున్నారు.

సారంగపూర్: మండలంలోని బోరిగాం, గోపాల్‌పేట్ గ్రామాల్లో గురువారం బీజేపీ మండలాధ్యక్షుడు విలాస్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధిహామీ కూలీల వద్దకు వెళ్లి పార్టీ అభ్యర్థి నగేశ్‌ను గెలిపించాలని కోరారు. గంగారెడ్డి, రాజేందర్‌రెడ్డి, రాజేశ్వర్, సాహెబ్‌రావు, విజయ్, గణపతి, రతన్, సంతోష్, జగదీశ్ ఉన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని గణేశ్‌నగర్‌లో బీజేపీ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. పట్టణాధ్యక్షుడు మల్లేశ్వర్, రావుల పోశెట్టి, సాహెబ్‌రావు, కౌన్సిలర్ దశరథ్, వేణు, శ్రీనివాస్ ఉన్నారు.



సోన్‌లో పథకాలను వివరిస్తున్న నాయకులు



చింతల్‌చాందలో మాట్లాడుతున్న నాయకులు

సోన్: మండల కేంద్రంలో వెళ్లి ఉపాధి కూలీలకు బీజేపీ నాయకులు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. ముత్కపల్లి నరేశ్, సంతోష్, గడ్డం నర్సయ్య, రాజు పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని కన్కపూర్, అబ్దుల్లాపూర్, వట్టోలి, ధర్మోర, పంచగుడి తదితర గ్రామాల్లో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ ముధోల్ అసెంబ్లీ జాయింట్ కన్వీనర్ సుమన్‌కుమార్, మంద భాస్కర్, సాయాగౌడ్, దేవాగౌడ్, గోపి, గంగాధర్, యోగేశ్ ఉన్నారు.

ఖానాపూర్: బీజేపీ అభ్యర్థి నగేశ్‌ను గెలిపించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు మండలంలోని గోసంపల్లెలో బూత్‌ల వారీగా ప్రచారం నిర్వహించారు. మండలాధ్యక్షుడు ప్రకాశ్, రాజేందర్, ఒడ్నాల రాజేశ్వర్, రాజ్‌కుమార్ ఉన్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని చింతల్‌చాంద, మల్లాపూర్ గ్రామాల్లో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పని ప్రదేశాల వద్దకు వెళ్లి ఉపాధి కూలీలకు కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించారు. అడ్వాల రమేశ్, ముత్యంరెడ్డి, గోవర్ధన్, ప్రభాకర్, రవీందర్‌గౌడ్, సురేశ్, రాజేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ఆత్రం సుగుణను గెలిపించుకుంటాం

- డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు



కాంగ్రెస్‌లో చేరిన సోన్ మండలం పాతపోచంపాడ్ నాయకులతో శ్రీహరిరావు

సోన్: ఆదిలాబాద్ ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించుకుంటామని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అన్నారు. సోన్ మండలంలోని పాతపోచంపాడ్ మాజీ సర్పంచ్ కావలి మమత బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి తన అనుచరులు 50 మందితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. గురువారం శ్రీహరిరావు నిర్మల్‌లోని తన నివాసంలో వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో బీజేపీ, బీఆర్‌ఎస్ ఖాళీ కావడం ఖాయమని పేర్కొన్నారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మధుకర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు రాజనర్సింహరెడ్డి, గంగారెడ్డి, రాజారెడ్డి, గంగాధర్, అక్తర్, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలో శ్రీహరిరావు సమక్షంలో సారంగాపూర్ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని ప్యారమూర్‌కు చెందిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు.

తానూరు: మండలంలోని బోరిగాం, ఉమ్రి(కే), బోల్సా, ఝరి(బి), ఝరి(బి)తండా, బెల్‌తరోడా గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ కార్యకర్తలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పుండలిక్, మాధవ్‌రావ్ పటేల్, చంద్రకాంత్ యాదవ్, రాజన్న, మధు పటేల్, సదాశివ్ పటేల్, దేవిదాస్ పాల్గొన్నారు.

కుంటాల: కేంద్రంలో ఇందిరమ్మ రాజ్యం వస్తేనే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఓలా, కుంటాల గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, గజ్జారాం, బుచ్చన్న, లక్ష్మణ్, హైమద్ పాషా, రమణ, మహేందర్, ఫహీంఖాన్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: ఎంపీగా సుగుణను గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు పట్టణంతోపాటు గ్రామాల్లో ప్రచారం చేశారు. మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, ఆ పార్టీ పట్టణాధ్యక్షుడు రమేశ్, శ్రీనివాస్, రాజ్‌కుమార్, చరణ్, స్వామి, అహ్మద్, శేషాద్రి ఉన్నారు.

భైంసాటౌన్: పట్టణంలోని ఏపీనగర్, పిప్రికాలనీల్లో కాంగ్రెస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. కౌన్సిలర్ చందూలాల్, శంకర్ చంద్రే, చౌండి రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

లక్ష్మణచాంద: సుగుణను గెలిపించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వొడ్నాల రాజేశ్వర్ కోరారు. గురువారం మండలంలోని మునిపెల్లి, మల్లాపూర్, మాచాపూర్ గ్రామాల్లో ఉపాధి కూలీలకు కాంగ్రెస్ పథకాలు వివరించారు. అట్ల రవీందర్‌రెడ్డి, ఈటెల శ్రీనివాస్, రవి, లింగారెడ్డి, భీమన్న పాల్గొన్నారు.

లోకేశ్వరం: మండలంలోని రాజూర, బామ్ని(కే), ధర్మోర గ్రామాల్లో ఉపాధి పనులు జరిగే చోట కాంగ్రెస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ ముత్తగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, సుధీర్‌రెడ్డి, నర్సారెడ్డి, ముత్తన్న, సాయి, నారాయణ్‌రెడ్డి, రమేశ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.



ఖానాపూర్: గోసంపల్లెలో ప్రచారం చేస్తున్న నేతలు

కడెం: మండలంలోని పెద్దూర్‌లో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు వాజీద్‌ఖాన్ అధ్వర్యంలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉపాధి కూలీలకు కాంగ్రెస్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో రఫీక్, బబ్లూ, బ్రహ్మచారి, వసివొద్దీన్, శ్రీనివాస్, నవీన్ నాయకులు పాల్గొన్నారు.

బుద్ధపూర్ణిమ విజయవంతం చేయండి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న బీఎస్‌ఐ నాయకులు

భైంసాటౌన్: ఆదిలాబాద్‌లో ఈనెల 14 నుంచి 23 వరకు జరిగే వైశాఖ బుద్ధ పూర్ణిమ ఉత్సవాలను విజయవంతం చేయాలని బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా పట్టణ అధ్యక్షులు ప్రసంజిత్ హేమ్లే అన్నారు. గురువారం పట్టణంలోని బుద్ధవిహార్‌లో శ్రామినేర్/బౌద్ధాచార్య శిబిరం కరపత్రాలను ఆవిష్కరించారు. దీనికి బౌద్ధ భిక్షువులు పూజ్య బంతే సారిపుత్ థేరోజీ (ముంబై), పూజ్యమాతా ఆర్య సంఘ మిత్ర జీ (ఆదిలాబాద్), కేంద్రీయ శిక్షకులు యువరాజ్ జీ మోరే (నాందేడ్) హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. బౌద్ధ ఉపాసకులు, మాజీ శ్రామినేర్, బౌద్ధాచార్యులు, కేంద్రీయ శిక్షకులు, బౌద్ధ దమ్మ అభిమానులు, అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. దమ్మానంద్ దేవ్కే, ఏక్‌నాథ్ బిరదే, సోమాజీ జాదవ్, సాగర్‌బాయి జంగ్మే, శ్రావణ్ వాగ్మారే, ముత్తన్న తదితరులు పాల్గొన్నారు.

సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూస్తాం



సబ్‌స్టేషన్ పరిశీలిస్తున్న ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ మోహన్‌రావు, అధికారులు

లోకేశ్వరం: కొత్తగా ఏర్పాటు చేసిన సబ్‌స్టేషన్ ద్వారా వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందుల్లేకుండా చూస్తామని ఎన్‌పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్) మోహన్‌రావు అన్నారు. గురువారం మండలంలోని రాజూర గ్రామంలో నూతన సబ్‌స్టేషన్‌ను మోహన్‌రావు పరిశీలించారు. సబ్‌స్టేషన్‌లో వీసీబీ(వాక్యూమ్ సర్క్యూట్ బ్రేకర్ల) ట్రాన్స్‌ఫార్మర్ల పనితీరు తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలకు నిరంతరం విద్యుత్ సరఫరా చేస్తామని పేర్కొన్నారు. ఈసందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వారి వెంట సీజీఎం గుప్తా, నిర్మల్ ఎస్‌ఈ చౌహాన్, భైంసా డీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఏఈ శివకుమార్ ఉన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం



కన్కపూర్‌లో మాట్లాడుతున్న శ్యాంసుందర్



నిర్మల్‌లో ప్రచారం చేస్తున్న నాయకులు

లోకేశ్వరం: ఆదిలాబాద్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్ అన్నారు. గురువారం మండలంలోని కన్కపూర్, అబ్దుల్లాపూర్, జోహర్‌పూర్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పదేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేయాలని కోరారు. నాయకులు దిగంబర్, ప్రశాంత్, సాయారెడ్డి, ప్రకాశ్ ఉన్నారు.

కుంటాల: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి చూసి ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని ఆ పార్టీ ముథోల్ అసెంబ్లీ సమన్వయ సభ్యురాలు డాక్టర్ రమాదేవి పేర్కొన్నారు. గురువారం కుంటాలలో బూత్ స్థాయి కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఆమె మాట్లాడారు. సమావేశంలో పార్టీ మండల కన్వీనర్ పడకంటి దత్తాద్రి, సోషల్ మీడియా జిల్లా ఇన్‌చార్జి పెంటవార్ దశరథ్, కుమ్మరి భాస్కర్, దాసరి కిషన్, గోకుల్, ఖదీర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌టౌన్: ఆదిలాబాద్ ఎంపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కును గెలిపించాలని కోరుతూ గురువారం జిల్లా కేంద్రంలోని పలు వార్డుల్లో బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము మాట్లాడుతూ బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. పూదరి నరహరి, ఆదుముల్ల విశాల్, నజీరుద్దీన్, తదితరులు ఉన్నారు.

నేటి సమ్మేళనం విజయవంతం చేయండి



మాట్లాడుతున్న ఇన్‌చార్జి విలాస్

భైంసాటౌన్: పట్టణంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహించే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విలాస్ గాదేవార్ కోరారు. గురువారం ఆయన పట్టణంలో మాట్లాడారు. ముథోల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు లోలం శ్యాంసుందర్, డా కిరణ్ కొమ్రేవార్, రమాదేవి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ భైంసా పట్టణ, మండల కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి మాజీ మంత్రి, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి జోగు రామన్న, ఎంపీ అభ్యర్థి సక్కు హాజరవుతారని.. కార్యకర్తలు రావాలని కోరారు.

పైపులైన్‌కు లీకేజీ.. వృథాగా జలం



పైపులైన్‌కు లీకేజీ ఏర్పడి వృథాగా పోతున్న నీరు



హిప్నెల్లి వాగులో చేరిన మిషన్ భగీరథ నీరు

తానూరు: భైంసా నుంచి తానూరుకు తాగునీటిని సరఫరా చేసే మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్‌కు తరచుగా లీకేజీలు ఏర్పడి నీరంతా వృథాగా పోతుంది. గురువారం హిప్నెల్లి శివారులో భగీరథ పైపులైన్‌కు లీకేజీ ఏర్పడటంతో నీరంతా వృథాగా పోయి సమీపంలోని వాగులో చేరింది. దీంతో తానూరుతోపాటు 13 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడి.. సమస్య తలెత్తుతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. లీకేజీలకు మరమ్మతు చేయించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

జొన్నల కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీవో, ఇతర అధికారులు

తానూరు: తానూరు పీఏసీ ఎస్ ఆధ్వర్యంలో డాంగపల్లి వ్యవసాయ గోదాంలో గురువారం హైబ్రిడ్ జొన్నల కొ నుగోలు కేంద్రాన్ని అధికారులు ప్రారంభించారు. ఈసందర్భంగా పీఏసీఎస్ సీఈవో భూమయ్య మాట్లాడుతూ క్వింటాల్‌కు రూ.3,180 ధర అందిస్తున్నామని.. రైతులు దూరప్రాంతాలకు వెళ్లకుండా స్థానికంగా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో పంటను అమ్ముకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్‌సింగ్, ఏఈవో పవన్, సాయినాథ్ తదితరులు ఉన్నారు.

ఉత్సవాలు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి ఆలయ ఉత్సవాలు గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ఒడిబియ్యం, పసుపు, కుంకుమ గాజులను భక్తులు సమర్పించారు. పట్నం వేసి పూజలు చేశారు.